# పండుగ

ఒకప్పుడు నేను జీవించివుండేదాన్ననీ, ఆశల్లో ఉద్రూతలూగుతూ ఆనందించే దాన్ననీ, భవిష్యత్తు స్వర్గలోకంలా మెరుస్తూ మురిపిస్తూ వుండేదనీ ఇంకా నాకు గుర్తున్నది. అమ్మా, నాన్నగారూ, పిల్లలం ముగ్గురం ఎంతో ఆనందంగా వుండేవాళ్ళం. నేను    లా, శ్యామల ఎంఎస్సీ, సుందరి డాక్టరుకోర్సు చదివాం. శ్యామల చక్కగా డాన్సు చేసేది. సుందరి బాగా పాడేది. నేను తెలివిగలదాన్ని. 'ఆడపిల్లలయితేనేం, రత్నాలు' అనే వారు అందరూ. ప్రపంచమంతా తీసికట్టుగా, మా పాదాల ముందున్నంత గర్వంగా వుండే వాళ్ళం. అది మహత్తరమైన స్వేచ్ఛ. ఆలోచన తాకని స్థితి. అక్కడ జీవించడం, ఆశించడం వేర్వేరు విషయాలు కావు.

ఇప్పుడు నాన్నగారు లేరు. అమ్మలేదు. 'మేము' లేము. ముగ్గురు అక్కచెల్లెళ్ళం ఎవరి సంసారాలు వాళ్ళు చూసుకుంటూ, ఒకరితో ఒకరికి ఎక్కువ సంబంధం లేకుండా వున్నాం. ఆ ధీమా, గర్వం, ఆనందం ఏమైపోయాయో తెలియదు. ముగ్గురం సామాన్యపు సంసార పక్షపు స్త్రీలమై పోయాము... అది నా బాధకు కారణం కాదు... కాని ఇప్పుడు నన్నావరించి వున్న నిస్పృహ, నిస్సత్తువల్లోంచి ఒక్కోసారి గతం జ్ఞప్తికి వచ్చినప్పుడు ఈ భేదం గుర్తుకువచ్చి ఆశ్చర్యం కలుగుతుంది. నేను జీవించటం, ఆశించటం ఎప్పుడు మరిచిపోయానో తెలియదు. జీవించటం, ఆశించటం అనేవి రెండు వేర్వేరు విషయాలా? నాకేమీ తెలియటం లేదు.

ఇవ్వేళ సంవత్సరాది పండుగ. అందరూ యిండ్లు రంగులతో ముగ్గులతో మామిడాకులతో అలంకరించుకొని, తలంటు స్నానాలు చేసి కొత్త బట్టల్లో అర్థంలేని కోలాహలం చేసుకుంటున్నారు. ఆయన స్నానం కానిచ్చుకుని ఇస్త్రీబట్టల్లో పైన కూర్చున్నారు పేపరు చూస్తూ. పండుగనాడు కొత్తబట్టలు వేసుకోవటం ఇష్టంలేదుట! ఎనిమిది గంటలైంది. పదేళ్ళ బాబు నిద్రమంచంమీదనుండీ ఇంకా లేవలేదు. అయిదేళ్ళ పాప యానాదివాళ్ళ పిల్లల్తో ఆడుకోవటానికి వెళ్ళింది. 'వెనకింటి చౌదరిగారి పిల్లలకి ఆటలురావు. శాస్త్రిగారి పిల్లలు కొడతారు. యానాది పిల్లలు పాపమ్మా అంటూ బాగా ఆడతారు' అంటుంది. మురికి పిల్లల్తో ఆడవద్దన్నకొద్దీ వాళ్ళ సుగుణాలు, వాళ్ల

గొప్పదనం జాస్తీగా కనబడుతున్నాయి పాపకి. నిజం చెప్పాలంటే అందులోనూ కొంచెం నిజమున్నదని నాకూ అనుమానమే.

నేను కాఫీ త్రాగి మామూలుగా ఇంట్లో నిస్సత్తువగా కూర్చుని వున్నాను. వాళ్ళకి తలంట్లు కానిచ్చి-పోసుకుంటే-తరువాత నేనూ స్నానం చెయ్యొచ్చని కూర్చున్నాను. ఇల్లుమాత్రం కడిగించాను. రంగులూ, ముగ్గులూ, మామిడాకులూ అలంకరించలేదు. అవన్నీ అర్థంలేని వ్యవహారాలు అనిపిస్తాయి. అంతగా పెట్టే ముగ్గా అరగంటలో పాదాలక్రింద తేమతో మట్టిలో కలిసిపోయి రొచ్చుగా తయారవుతుంది. సాయంత్రానికి మామిడాకులు ఎండిపోయి చెత్తగా వేళ్లాడుతుంటాయి. ఇల్లు కడిగించటంలో శుభ్రత అని అర్థం వుందిట. మా ఇల్లు వారానికోసారి బూజాదులపబడి కడిగించబడి శుభ్రంగా వుంటుంది. అయినా సాటి మానవులతో సంబంధం కొంచెమైనా వుండాలని మళ్ళీ కడిగించాను. వేపపూత తెప్పించాను. 'జీవితం వివిధానుభూతుల కలయిక' అనుకున్నా సరిపోతుంది, షడ్రుచులతో పోలిక తెస్తే తప్పు తెలియని క్లిష్ట విషయం కాదు. కడుపు శుభ్రం చేస్తుంది అంటున్నారు- ఇందులో కొంత అర్థం వున్నది. కాని మా కడుపులు శుభ్రంగా పనిచేస్తున్నాయి. ఇప్పుడు పండుగలనేవి అర్థంపర్థంలేని ఆచారాలు. పాతకాలపు అలవాట్ల తాలుకు శవాలు. గుదిబండల్లా పట్టుకుని దిగలాగే జ్ఞాపకాల నీడలు. ఇలాంటి అపసవ్యపు పనులు చెయ్యాలంటేనూ మనసొప్పదు. మానాలంటేనూ మనసు ఒప్పదు. అందుకే యీ నిస్సత్తువ. రోజూ ఈ సరికి పిల్లలూ నేనూ స్నానం చేసేవాళ్ళం. ఇవాళ ముగ్గురం అలాగే వుండిపోయాం. ఆయన రోజూ తొమ్మిదికి చేసేవాళ్ళు. 'ఎంతయినా పండగ కదా' అని ఏడున్నరకే కానిచ్చుకున్నారు ఇవ్వాళ. ఈ ఇల్లూ ఆ పండుగలాగే అర్థం లేకుండా వున్నది.

ఇదివరకు బాబు చిన్నపిల్లవాడుగా వున్నప్పుడు పండుగలు అందరిలా ఉత్సాహంగానే చేసేదాన్ని. అన్నిట్లోనూ అర్థంకోసం వెతికేదాన్ని కాదు. అనాదినుండీ వస్తున్న ఆచారాలు, అవి కల్పించే ఆనందమయ జగత్తు, వాటిలోని పరమేశ్వరభావం-నేనెరిగిన ఇవన్నీ నా బిడ్డకు కావాలని చేశాను. వాడు మంచి పిల్లల్తో ఆడుకున్నాడు. బాగా చదువుకుంటున్నాడు. పాపలాగా ప్రతిదానికీ ఎదురువాదం చెయ్యడు. కాని పెద్ద వాడవుతున్నకొద్దీ వాడిలో ప్రస్ఫుటమవుతూ వస్తున్న పాసివ్ రెసిస్టెన్స్ నాకు ఆశ్చర్యం కలిగించింది. ఎక్కడో పొరబాటు వున్నది అనుకున్నాను. 'మంచి' అన్న చట్రంలో బిగించి వాడి స్వాతంత్ర్యాన్ని అరికట్టి అన్యాయం చేశానా అనిపించింది. ఆలోచించగా మంచి అన్నదానికి స్వతహాగా విలువ వున్నదో లేదో నాకు తెలియలేదు. మంచిచెడ్డల్లోనూ, తప్పొప్పుల్లోనూ దాక్కొని లేవేమో అర్థమూ, సత్యమూ, దేవుడూను! ప్రపంచమంతా అర్థంలేని కలగాపులగపు వ్యవహారంగా కనిపించింది. నేను ఎవరో, ఎటు నడుస్తున్నానో, నేను వున్నానో లేదో నాకు తెలియటం లేదు.

స్వభావతః పాప మంచి పిల్ల. భయం ఎరుగదు. సూటిగా ఆలోచిస్తుంది. నాకే

తెలియని తప్పొప్పులు దానికి నేను చెప్పలేదు. ప్రస్తుతం అది యానాది పిల్లల్తోనే ఆడుతుంది. అనకూడని మాటలన్నీ అంటుంది. నేరేడు పండ్లు, రేగుపండ్లు, జామపండ్లు, సీతాఫలాలూ, వెలక్కాయలూ, చాక్లెట్లూ... ఏవి దొరికితే అవి ప్రీతిగా తింటుంది. అన్నంమాత్రం పరమ శత్రువు. పాపది యాక్టివ్ రెసిస్టెన్స్... ఇద్దరూ పిల్లలూ రెండు రకాలైన కొరకరాని కొయ్యలు. ప్రొద్దున్నే నీళ్ళు పోసుకొమ్మన్నందుకు ఒక్కళ్ళూ ఇంతవరకు చేతికి అందలేదు. ఇది ఒక కుటుంబం అనుకోవటానికి ఏమాత్రం వీల్లేకుండా వున్నది. నలుగురు వ్యక్తుల సముదాయం అనుకోవలసిందే.

పాప సుడిగాలిలా పరుగెత్తుతూ వచ్చింది. "ఊళ్ళోవాళ్ళందరూ, చెంచీవాళ్ళు గూడా, మామిడాకులు కట్టుకున్నారు. మనం ఎందుకు కట్టుకోలేదు?" అన్నది.

"ఆ మామిడాకుల్లో నీకేమైనా పండుగ కనపడ్డదా? అందరూ స్నానాలు కానిస్తే నీ వెందుకురాలేదు?" అన్నాను. పాపకి ఆత్మాభిమానం బాగా దెబ్బతిన్నది. నాకు అందకుండే దూరంలో బయటికి పరుగెత్తటానికి వీలుగా నిల్చుని 'గాడిదా, దున్నపోతూ, కెక్కాబిక్కి'' అన్నది. నాకో అనుమానం వచ్చింది. "అన్నీతెలిశాయిగానీ, కెక్కాబిక్కి అంటే ఏమిటీ?" అన్నాను. "నీ మొఖం" అనేసి పారిపోయింది.

'ఈ పిల్లకి ఎప్పటికైనా బుద్ధివస్తుందా' అనుకుంటూ బాబును లేపటానికి వెళ్ళాను. పావుగంట లేపాక అట్నుంచీ ఇటు తిరిగి పడుకుంటూ, "పండుగనాడు ఎక్కువ సంతోషంగా వుండాలా? తక్కువగా వుండాలా? కాస్సేపుండి లేస్తాను" అన్నాడు. అదీ నిజమేననుకొని వచ్చేశాను. ఈ పండుగ పూర్తిగా అర్థంలేని వ్యవహారం అయిపోయింది. పండుగనే కాదు, ఏ పనీ చెయ్యలేను నేను. నా మనసు ఏదో స్తబ్దతలో చిక్కుకుపోయింది. నన్ను నిర్జీవత ఆవరించింది...

భోజనాలు కాగానే బాబు పరుగెట్టుకుంటూ వచ్చాడు. 'నాన్నగారు ఇప్పుడే కావలి వెళ్దామన్నారు. తొందరగా..." అనేసి పరుగెట్టాడు. విషయం ఏమిటని కనుక్కుంటే కావలిలో వున్న మా బంధువులు ఎప్పుడో కనబడి తప్పకుండా వాళ్ళింటికి రమ్మనమని చెప్పారుట. నాకు ఆశ్చర్యం కలిగింది. మా తాతగారి అన్నగారి సంతతివాళ్ళు కావలిలో వున్నారు. ఆస్తివిషయంలో తాతగారిని మోసంచేసి వుత్తచేతుల్తో బయటకు పంపి వాళ్ళు జమీందార్లుగా వెలుగుతున్నారు. తాతగారు బెజవాడ వచ్చి చిన్న ఉద్యోగం చేసి కష్టపడి నాన్నగారిని చదివించి లాయరుగా చేశారు. కావలివారిమీద తాతగారికేమీ ద్వేషం లేకపోయినా నాన్నగారికి ఉండేది. వాళ్ళకీ మాకూ రాకపోకలు లేవు. అలాంటివారి యింటికి వెళ్ళటమేమిటని నాకు అర్థం కాలేదు.

"జగ్గూ మీ పెద్ద నాన్నకొడుకట. నాకు ప్రెసిడెన్సీలో రెండు సంవత్సరాలు జూనియర్. బాగా కలిసివుండేవాళ్ళం. తప్పకుండా వస్తామని చెప్పాను" అన్నారు. తాతగారికి వాళ్లమీద ఏమీ కోపం వుండేది కాదు. అదొక రకం అమాయకులు. విచిత్రమైన మనిషి. మధ్యమధ్యలో తమాషాగా గ్రాంథికంలో మాట్లాడేవారు. 'భగవంతుడు

వారికాబుద్ధినిచ్చెను. నాకిట్టి కర్మనిచ్చెను. ఆహా భగవల్లీలలు కడువిచిత్రములుగదా' అనేవారు. ఆయన మాటలకి చిన్న పిల్లలమైన మేము తెగనవ్వేవాళ్ళం. తరువాత దేవుడి పిచ్చిలో 'అదిగదిగో, పరమేశ్వరుడు నా కొరకై పంపియున్న దివ్యరథము వచ్చియున్నది' అంటూ చనిపోయారు. అందరూ అతన్ని 'వేపకాయంత వెర్రి' లెక్కలో భావించేవాళ్ళు. పైకి అందరితోపాటు నవ్వినా నాకు మాత్రం ఆయన మాటలు ఆసక్తి కలిగించేవి.

"వెర్రి అంటే ఏమిటి తాతయ్యా?" అన్నాను ఒక రోజున. "సగటు మనః పరిజ్ఞానముకన్న తక్కువగా నుండిన బుద్ధి హీనుడందురు. విశేషముగానుండిన వెర్రియందురు" అంటూ నవ్వారు తాత.

మా ఇంట్లో వుండే మిగతా ముగ్గురు మనుష్యులూ ఏదైనా తలచుకుంటే దానిని నేను మార్చలేనన్న విషయం నాకు బాగా తెలుసు. అందుకే బయల్దేరాను.

వాళ్లు జమీందార్లు అయివుండటమే కాకుండా జమీందార్లుగా కనబడ తారుగూడాను. దాదాపు అందరూ పొడుగ్గా కొంచెం స్థూలంగా తెల్లగా వున్నారు. అరటి బోదెల్లాగా నవనవలాడుతూ మెరుస్తున్నారు. ఎన్నో తరాల నుండి వస్తున్న ఐశ్వర్యం, సుఖజీవనం ఆ మెరుపులోంచి తొంగిచూస్తున్నవి. వాళ్ళ ఇల్లూ, పద్ధతులూ నాకు బాగా నచ్చాయి. క్రింద పెద్ద హాలుకి చుట్టూ ఒక్కొక్కళ్ళకీ ఒక్కో బాత్ ఎటాచ్‌డ్ గది. భోజనశాలా, వంటగదీ వేరుగా వున్నాయి. మేడమీద వున్న విశాలమైన గది ఇచ్చారు మాకు. అది అతిథులకి ఇచ్చేది. నాలుగు మంచాలమీద మందపాటి మెత్తని బూరుగుదూది పరుపులూ తెల్లటి దుప్పట్లూ మనసుకు హాయిగొలిపాయి. గదికి అనుబంధంగా వున్న స్నానాలగది శుభ్రంగా వున్నది. వాష్‌బేసిన్ మెరుస్తూ వున్నది. ఎప్పటికైనా మా ఇంటికి వచ్చిన అతిథులకు అలాంటి సౌకర్యం కలుగజేయాలని నా చిరకాల వాంఛితం...

కొంచెం సేపటికి చాలామంచి కాఫీని తెచ్చిఇచ్చిన పనిమనిషి నన్ను 'పెద్దమ్మ'గారి గదికి తీసుకెళ్ళింది. ఆమె మా పెదనాన్నగారి భార్య. గృహయజమానురాలు. మిగతా అందరికంటే లావుగా భారీగా వున్నది. పెద్ద హంసతూలికా తల్పంలాంటి దానిమీద పడుకుని వున్నది. నన్ను పక్కన కుర్చీలో కూర్చోపెట్టిన పని మనిషి ఆమెకు కాళ్ళు ఒత్తుతూ నిలుచున్నది. ఆమె నన్ను ఆప్యాయంగా పలకరించి మా కుటుంబ వివరాలన్నీ కనుక్కున్నది. మా ఆస్తిపాస్తుల్ని గురించీ, మా జీవనవిధానం గురించీ ప్రశ్నించింది. ఆమెలో బంధుప్రీతికంటె బయటి ప్రపంచాన్ని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కనిపించింది. జమీందారీ ఫాయాల్లో లంకంత మేడల్లో బంధితులైన వాళ్ళే ఆమె మాటల్లో కన్పించారు. తాము వేరే స్థాయికి చెందినవాళ్ళం అన్న నిజం ఆమె మాటలవెనుక స్థిరంగా వున్నా, గర్విష్ఠి అనటానికి మాత్రం వీల్లేదు. ఆమె మాటల్లో ముక్తసరితనం లేదు. తమకు వచ్చిన జబ్బులూ, వాటికి వైద్యం జరుగుతున్న విధానం ధారాళంగా చెప్పింది. గుండె జబ్బు, డయాబెటిస్,

బ్లడ్‌ప్రెషర్, ఎలర్జిక్ తుమ్ములూ-అన్నీ ఎవరెవరికి వున్నాయో వాటి వైద్యానికి నెల్లూరునుండి వచ్చి వెళ్లే డాక్టర్ శాస్త్రి, గుంటూరునుండి వచ్చే డాక్టర్ కోదండపాణిగారూ, అవసరమైనప్పుడు మద్రాసునుండి కారులో వచ్చి రెండువేల ఫీజు తీసుకునే ప్రసిద్ధవైద్యులు కృష్ణన్ మొదలియార్‌గారూ అందరిని గురించీ చెప్పింది.

కాని పెదనాన్నగారికి కడుపులో కాన్సర్ వచ్చి ఆపరేషన్ చేయబడిన వైనమూ, అప్పటినుండీ ఆయన తగ్గిపోతున్న విషయమూ చెబుతున్నప్పుడు ఆమెలో దిగులు కనిపించింది. ఆమె దిగులు చూసిన నాలోనూ దిగులే కలిగింది. 'ఇంత ఐశ్వర్యంతో సుఖంగా వుండవలసిన వాళ్ళు! వీళ్ళకు కష్టాలు రాకూడదు' అనుకున్నాను. ఇట్టి కష్టాలన్నీ తీర్చగల వరదాయిని అని ప్రసిద్ధిబొందిన జొన్నవాడ కామాక్షమ్మ జ్ఞప్తికి వచ్చింది. మేము అక్కడికి వెళ్ళినప్పటి అలౌకికానుభూతి స్మృతిలో మెరిసింది...

అప్పుడు మేము నెల్లూరి దగ్గరగావున్న సముద్రతీరాన ఒక చిన్న వూళ్ళో వున్నాం. రెండు రోజుల సెలవు వచ్చింది. కొత్తగా కొన్న కారు వున్నది. ఇవాళ్టిలాగే ఒక మధ్యాహ్నం వున్నట్లుండి 'ఇవాళ జొన్నవాడ వెళ్దాం' అని తీర్మానించారు మా ఇంట్లోని మిగతా ముగ్గురూ. రెండు గంటలకి బయల్దేరి వెళ్ళి దేవి దర్శనం చేసుకొని సాయంత్రానికి ఇంటికి రావాలని ఉద్దేశ్యం. వూరు ఎంత దూరంలో వున్నదని అడగ్గా

"నేను వెళ్ళలేదుగాని కోవూరికి రెండు మైళ్ళుంటుందంటారు" అన్నాడు సందేహంగా మా జవాను రామయ్య. కోవూరుదాటాక టాంక్‌లో పెట్రోలు కొద్దిగానే వున్న వైనం గమనించాం. రెండుమైళ్ళే కదా తిరుగు ప్రయాణంలో వేసుకోవచ్చని ముందుకుసాగాం.

నాలుగుమైళ్ళుదాటాక చిన్నవూరొకటి వచ్చింది. జొన్నవాడ ఎక్కడని వాకబు చెయ్యగా 'ఇంకా ముందుకి పోయి పక్కకి తిరగాలి మట్టి బాటలోకి' అన్నారు. ఇంకో మూడు మైళ్ళుపోయాక మరో వూళ్ళో అడిగాం. అక్కడ ముగ్గురు మనుష్యులు సంప్రదించుకొని 'అబ్బో ఇక్కడెక్కడ జొన్నాడ. ఇంకా నాలుగుమైళ్ళు పోయి పక్కకి తిరిగి ఒక మైలు పైన పోవాలి' అన్నారు. మాకు ఉత్సాహం చల్లారింది. అయిపోతున్న పెట్రోలు, రాబోతున్న మట్టిబాటా మనసులో మెదిలాయి. 'ఆ మట్టిబాటలో చిన్నకారు పోగలదా' అనడిగాం. 'బస్సులు కార్లు అన్నీ పోతై' అన్నారు. ఇక్కడ మనుష్యులకి రోడ్డుగురించి గాని దూరంగురించిగాని జ్ఞానం తక్కువ అని గొణుక్కున్నారు ఆయన. 'మరి దేవుడు వూరికే కన్పిస్తాడా... వెతికి వెతికి వేసారేకగాని...' అన్నా, ఎవరూ నవ్వలేదు.

ఇలాగ పదిమైళ్ళు ప్రయాణం చేశాక కన్పించిన మట్టిబాటను చూడగానే మాకు బాగా నిరాశ కలిగింది. గుంటలు మిట్టలతో ఎగుడుదిగుడుగా వున్నది. అందర్లో కోపతాపాలు హెచ్చిపోయాయి. పెట్రోలు విషయం జ్ఞాపకం చెయ్యలేదని అన్యాయంగా నామీద దండయాత్ర చేశారు ఆయన. రామయ్య అజ్ఞానాన్ని కోపగించుకున్నాడు బాబు. చాక్‌లెట్లు మరచిపోయినందుకు ఏడుపు ప్రారంభించింది పాప. నేను చెప్పినట్లు

అంబాసిడరు కారు కొనివుంటే యీ రోడ్లులోనైనా వెళ్ళివుండొచ్చనీ పై మెరుగు చూసి హెరాల్డు కొన్నందుకు యిహ వెనక్కి వెళ్ళటమే గత్యంతరమనీ తెలియపరచాను నేను.

కారు విషయం దెప్పటం సహించలేక "ఏమైనాసరే ముందుకు వెళ్ళాల్సిందే" నని కారు స్టార్టు చేశారు. మట్టిబాటలో ఎంతో అవస్థమీద ఒక మైలు వెళ్ళాక చుట్టూ చూశాం. గుడిగాని వూరుగాని కన్పడలేదు. చుట్టూ పంటచేలు. ఇంకొంచెం ముందుకుపోయి పొలంనుండి వస్తున్న ఒక రైతును ప్రశ్నించాం. ఇంకో మైలు ముందుకు పోవాలన్నాడు. మైలు పోయాక దూరాన వూరుకన్పించింది. వూరిని చూడగానే సంతోషం కలిగింది. ఒకవేళ పెట్రోలు అయిపోయి యిక్కడే నిలిచిపోయినా తలదాచుకోను చోటివ్వగల సుమారుపాటి ఇళ్ళున్నాయి. అక్కడ గుడికోసం వాకబు చేశాం. అది జొన్నవాడకు వెళ్ళేబాట అయిన విషయం నిజమేగాని, యీవూరు జొన్నవాడ కాదనీ, ఇంకో మైలున్నర ముందుకు వెళ్ళాలనీ తెలిసింది. జొన్నవాడను చేరగలమన్న ఆలోచన మాయమైపోయింది. వెనక్కి తిరిగి వెళ్ళాలన్న ఆలోచనా రాలేదు. అపరిచితమైన చోటులో చిక్కుకుపోయినట్లనిపించింది. ఎత్తుపల్లాలతో నిండిన మట్టి బాటలో యిసుకపాలు హెచ్చవుతూ ముందుకు వెళ్ళటం కష్టమైపోయింది. చుట్టూ వుండే ప్రదేశం స్వరూపం మారిపోయింది. పంటచేల బదులుగా చూపుమేర అంతా నిర్జీవమైన నేల. అక్కడక్కడ రాళ్ళగుట్టలు. అర్థంకాని ఆశాలేశంగాని లేని నిరుత్సాహజనకమైన నిస్సారమైన రాతినేల. ఎక్కడా వూరున్న జాడలేదు. సూర్యుడు వేడిమిని కోల్పోయి చల్లబడిపోతున్నాడు...

ఇంతలో బాటవంపుతిరిగి నాలుగు వూరిళ్ళు కనిపించాయి. అదే జొన్నవాడ. ఒక రాతిగుట్ట కావలగా దాక్కుని వున్న చిన్న గుడి మా గమ్యస్థానం అని తేలింది. ఈ అస్తవ్యస్తపు ప్రయాణం ఒక కొలిక్కి వచ్చినా, యింత సేపటినుండీ పడిన విసుగులోంచి మనసు కోలుకోలేదు. అమ్మవారిని చూడాలన్న ఆసక్తి ఏమాత్రం లేదు. ఈ ప్రయాణం అర్థంలేనిదిగా నిష్ప్రయోజకంగా తోచింది. నిస్పృహ, నిర్జీవత మనసునిండా వున్న చీకాకుల చెత్తను ఆవరించాయి.

గుడి బయటికికన్పించినంత చిన్నదిగా లేదు లోపల. పాతికమంది వరకూ భక్తులు ఆవరణలోన వున్నారు. ఒకామె బాహ్యస్మృతి లేనట్లుగా కన్నీరు కార్చుకుంటూ పెద్దగా దేవీనామ సంకీర్తనం చేస్తూ ప్రదక్షిణం చేస్తోంది. ఇద్దరు దంపతులు కాబోలు పొర్లుదండాలు పెడుతున్నారు. మిగతావారు పూజాద్రవ్యాలు ముందిడుకొని దేవి కృపారసాన్ని గురించి చెప్పకుంటూ వున్నారు.

ఇంకా పూజారి రాలేదు. గుడి ఆవరణనంతా పరిశీలిస్తూ చుట్టూ తిరిగాం. ఓ ప్రక్కగా వెలుపలికిగావున్న వాకిట్లోకి వెళ్ళి తొంగిచూశాం. అనుకోకుండా ప్రత్యక్షమైన అద్భుత సుందర దృశ్యం చూసి అవాక్కులమై నిల్చుండిపోయాం. ఆలోచన స్తంభించిపోయింది. కాలం నిలిచిపోయింది-మా ముందర క్రిందుగా విశాలమైన పెన్న-

ఇసుక మేటల మధ్యలో సన్నని పాయలుగా వినోదంగా ఆడుకుంటున్న నీటిజాళ్లు-పడమటి వేపున అస్తమిస్తున్న సూర్యుడినుండి పెన్నలోనికి ప్రవహిస్తున్న పరమసుందరమూ అద్భుతమూ అయిన వివిధ వర్ణసముదాయమైన తేజస్సు- సూర్యుడే తేజస్సై... పెన్నయై- స్తబ్దతలోంచి జీవంలోనికి ఒక్కసారిగా గెంతిన మనస్సు ఆనందఝరియై ప్రవహించింది. ప్రపంచంలోనుంచీ సర్వశక్తుల్నీ పరిగ్రహించుకున్న కాంతిమూర్తి సచ్చిదానందుడు ఈ మూలన దాక్కొని అకస్మాత్తుగా ప్రత్యక్షమైనాడు. మనస్సుకతీతమైన సృష్టిరహస్యం ముందు నిల్చున్నట్లుగా అందరానిదేదో అక్కడ నిక్షిప్తమైయున్నట్లుగా ఆద్యంతాలు లేనికాలంలో అనంతమైన విశ్వంలో మనిషి దేనికోసం వెతుకుతున్నాడో అది ఎదురైనట్లుగా స్థాణువులా నిల్చుండి పోయాను. అలౌకికమైన ఆనందం శరీరాన్ని ముంచెత్తింది.

"పూజారి వచ్చాడు. అమ్మవారికి పూజ జరుగుతోంది" అన్న హెచ్చరికతో కదిలి గుళ్ళోకి వెళ్ళాము. కామాక్షిదేవి-జగన్మాత ప్రసన్నవదనంతో నిల్చున్నది. ఆమెలో పొంగులు వారుతున్న ప్రసన్నత నా మీదికి ప్రవహిస్తోంది. అన్ని ప్రశ్నలకూ సమాధానం, అన్ని సమస్యలకూ కీలకం ఇక్కడే వున్నది. ఆమే ప్రేమమూర్తి. ఆమె వరదాయిని. ఈ సృష్టి అంతా ఆమె కరుణ! ఆ నాటి జ్ఞాపకంతో ఆనాటి ఆనందం స్వేచ్ఛ యిప్పుడు నాలో తోచాయి.

"మీరు ఎప్పుడైనా జొన్నవాడ వెళ్ళారా? చాలా దగ్గర్లో వున్నారు. అక్కడ కామాక్షమ్మ పిలిస్తే పలుకుతుందంటారు" అన్నాను.

ఆమె ఆసక్తితో నావైపు తిరిగింది. "అమ్మాయ్, నేనూ యీ విషయం విన్నాను... వెళ్దామనుకున్నాం కూడా ఒకటి రెండుసార్లు... కాని పడలేదు. రోడ్డు మంచిది కాదంటారు..." అంటూ గొంతు బాగా తగ్గించి "అసలు విషయం ఏమిటంటేనమ్మా... పరాయిచోటుకి వెళ్లి ఒక్కరోజైనా వుండటం నాకు వీలు కాదు... ఆ కమోడ్ లేకుంటే బయటికి వెళ్ళలేను" అన్నది.

ఆమె పరిస్థితికి నాలో సానుభూతి కలిగింది. "పాపం, ఆమె వెళ్ళలేదు" అనుకుంటూ వుండగానే నాలో గొప్ప నవ్వులాంటిది పుట్టింది. అదుపులో లేకుండా అది నన్ను వశపరుచుకొని వెల్లువగా బయటికి వచ్చింది. అపరిమితంగా నవ్వాను...మనిషికీ దేవుడికీ మధ్యగా నిలుచున్నది ఒక్క కమోడ్!... అలవాట్లూ, ఆశలూ, ఆచారాలూ, ఆశయాలూ, మనోప్రపంచం అంతా కలిసి ఒక పెద్ద కమోడ్‌లా కనిపించింది.

"అందరికీ అదే చిక్కు...అందరూ కమోడ్‌లో చిక్కుబడిపోయారు... దాన్ని వదిలి ఆవతలికి వెళ్లలేరు..." అన్నాను నవ్వుతూనే.

నా నవ్వును చూస్తున్నకొద్దీ ఆమెముఖంలో మార్పు• వచ్చింది. ఆమెలో సానుభూతి లోపించి కాఠిన్యం ప్రవేశించింది. కొంత అనుమానంగా, కొంత కోపంగా నన్ను చూస్తూ "అందరికీ కమోడ్‌లు వుండవుగా" అన్నది.

ఆమెను చూస్తున్నకొద్దీ నాకు ఇంకా ఇంకా నవ్వు వచ్చింది. ఆమెను షాక్ చెయ్యాలన్న ఆపరాని కోరిక కలిగింది.

"ఎవరెవరి కమోడ్‌లు వాళ్ళవండి...మేము కాన్వెంటులో వున్నప్పుడు అక్కడ డార్మిటరీలో కక్కసు దొడ్డిలేదు. రాత్రిపూట పిల్లలు అవసరంగా వెళ్ళాలంటే వుపయోగించటానికిగాను బాత్‌రూమ్‌లో ఒక బకెట్ పెట్టేవాళ్ళు. దాంట్లో సగానికి నీళ్ళుండేవి. ఎవరైనా దొడ్డికి వెళ్ళినప్పుడు ఆ బకెట్‌లోంచీ టప్‌టప్‌మంటూ పైకెగురుతున్న నీళ్ళు తగలకుండా తప్పించుకోవటానికి సర్కస్ చెయ్యాల్సివచ్చేది... అక్కడి కక్కసు దొడ్లకంటే యీ బకెట్ వ్యవహారమే శుభ్రం అనుకునేవాళ్ళు రాత్రిళ్ళు వెళ్ళేవారు... చూశారా ఎవరెవరి కమోడ్‌లలో వాళ్ళు చిక్కుబడి వున్నారు కదూ..." అన్నాను.

ఈ వుపన్యాసం ఇస్తున్నంతసేపూ నవ్వు తెరలు తెరలుగా వచ్చి నన్ను వూపేసింది. జుగుప్సాకరమైన ఈ వర్ణన వింటున్న ఆమె ముఖం రంగులు మారింది. కాళ్ళుపడుతున్న పనిమనిషితో "లక్ష్మీ, యీ అమ్మాయిని గెస్ట్‌రూమ్‌కు తీసుకెళ్ళు" అంటూ అటువైపుకు తిరిగేసింది. పెద్దమ్మగారితో ఇంటర్వ్యూ ముగిసింది.

ఇంకో బంధువులామె మమ్మల్ని భోజనాలకు వెంటబెట్టుకెళ్ళింది. అన్ని మర్యాదలూ యథావిధిగా జరిగినా పెద్దమ్మగారుగాని ఇతర ముఖ్యులెవరైనాగాని యిహ నాకు కన్పడరనేది రూఢి అయ్యింది.

రాత్రి గెస్ట్‌రూంలో పడుకున్నాం.

"మీతాతగారికి వేపకాయంత వెర్రివుండేదట కదా... ఇందాక మీ పెదనాన్నగారు గుర్తుకు తెచ్చుకున్నారు" అన్నారాయన నవ్వుతూ.

"అది నాకు వారసత్వంగా వచ్చిందని చెప్పలేదా" అన్నాను.

"అహహ... వాళ్ళు చాలా పెద్ద మనుష్యులు" అన్నారు.

నా పక్కలో పడుకున్న పాప ఉత్సాహంగా లేచి కూర్చుంది. "నాన్నా... అమ్మకి పెద్ద టెంకాయంత పిచ్చి వున్నది" అన్నది. మిగతా ఇద్దరు ఆ మాటలు నిజమేనని సమర్థించారు.

నామీద వున్న పాప చేతులు మల్లెపువ్వుల సంకెళ్ళలా తేలిగ్గా వున్నాయి. మా ఇంట్లో ఉండే మిగతా ముగ్గురు మనుష్యుల మధ్యనా వుండటమేనేమో పండుగంటే అనుకున్నాను.

పెద్దపెద్ద కిటికీల్లోంచీ ఆకాశం ముక్కలుముక్కలుగా కనిపిస్తోంది. నాప్రపంచాన్ని ఇంత అందంగా ఎంతో ప్రేమతో రచించాడు పరమేశ్వరుడు. ఇక్కడ వుండటమే విశేషం... ఇవాళ ఉగాది పండుగ.

★★★

కథా నిలయం
5447
శ్రీకాకుళం